క్లుప్తంగా

సీఎంను కలిసిన మొగిలిగిద్ద గ్రామస్తులు

పాఠశాల 150 ఏళ్ల ఉత్సవాలకు ఆహ్వానం



ఉత్సవాలకు రావాలని సీఎంను కోరుతున్న గ్రామస్తులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామస్తులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం కలిశారు. ప్రొఫెసర్ హరగోపాల్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రారంభించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ నెల 31న మొగిలిగిద్దకు వచ్చేందుకు సీఎం హామీ ఇచ్చినట్లు ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. సీఎంను కలిసిన వారిలో డాక్టర్ రవీందర్‌రెడ్డి, మల్లికార్జునప్ప, దయాసాగర్, అమృత్‌సాగర్, భవానీ శంకర్, రాకల మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఆకర్షిస్తున్న గాలిపటాలు



అమ్డాపూర్‌లో గాలిపటాలు ఎగురవేస్తున్న యువకుడు, చిన్నారులు

మొయినాబాద్‌రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని గ్రామాల్లో యువకులు, చిన్నారులు జోరుగా గాలిపటాలు ఎగురవేస్తున్నారు. గ్రామాల్లో వెలిసిన పతంగుల దుకాణాల్లో వివిధ బొమ్మలతో పాటు జాతీయ జెండా, ప్రధాని మోదీ, సినీ హీరోలతో రూపొందించిన గాలిపటాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. వాటిని చిన్నలు, పెద్దలు ఎగరవేస్తూ ఆనందాన్ని పంచుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో పతంగుల సంబురాలు అంబరాన్నంటుతున్నాయి.

కుమ్మరుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కుమ్మరుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం పట్టణంలోని రాఘవేంద్ర లాడ్జిలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుమ్మరి కులస్తులు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో మరింతగా రాణించాలన్నారు. కుమ్మరుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా కుమ్మరి కులవృత్తుల వారు మట్టి పాత్రలు తయారు చేసేందుకు స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్, తాలుకా అధ్యక్షుడు నడికూడ శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి రాయికల్ శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సినీ హాస్యనటుడిని కలిసిన నాయకులు



సినీ హాస్యనటుడు బ్రహ్మానందంతో మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, తదితరులు

చేవెళ్ల: మాజీ ఉపరాష్ట్రపతి వెంకటయ్యానాయుడు నిర్వహించిన సంక్రాంతి పండుగ వేడుకల్లో చేవెళ్ల బీజేపీ నాయకులు పాల్గొన్నారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో మాజీ ఉపరాష్ట్రపతి స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి పండుగ సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సినీ హాస్యనటుడు బ్రహ్మానందంను మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల యువ నాయకుడు డాక్టర్ మల్లారి వైభవ్ రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈర్లపల్లిలో మల్లన్న జాతరలో..

మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో ఆదివారం ఘనంగా మల్లన్న జాతర నిర్వహించారు. ఈ వేడుకల్లో చేవెళ్ల బీజేపీ నాయకులు డాక్టర్ ఎం.వైభవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింలు, రాములు, రాజశేఖర్, తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

- రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



కొలువైన స్వామివారు



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి దేవాలయం

కొందుర్గు: మండలంలోని సంజీవపురం చింతల్ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఇందుకుగాను ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ సమయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఈ సంవత్సరం కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ దేవాలయం మండలంలోని విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి సమీపంలో ఉండటంతో మూడు గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

రోజువారీ పూజా కార్యక్రమాలు..

ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 14న ధ్వజారోహణం, గణపతి హోమం, శకటోత్సవం, రాత్రికి భజనలు, 15న స్వామివారి అభిషేకం, 16న రథోత్సవం, పల్లకీసేవ, అదేవిధంగా దేవాలయ ఆవరణలో వెలసిన మైసమ్మ దేవతకు బండ్లు, బోనాల కార్యక్రమం ఉంటుంది. 17న స్వామివారి కల్యాణం, భజనలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింలు వివిధ పార్టీల ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న భీంభరత్

చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్

షాబాద్: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్‌ఎఫ్ వరమని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన మామిడి వెంకట్‌రెడ్డికి రూ.55వేల రూపాయల చెక్కు, రేగడిదోస్వాడ, మాచన్‌పల్లి గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎంతో మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుదని, ప్రజలంతా సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగల్లి చెన్నయ్య, పామెన నర్సింలు, యూత్ అధ్యక్షుడు పానుగంటి సురేశ్, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, నాయకులు తదితరులున్నారు.

పండుగకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!



జగదీశ్, సీఐ

మాడ్గుల: పండుగకు సొంతూర్లకు వెళ్లే వారు పలు జాగ్రత్తలు పాటించాలని సీఐ జగదీశ్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతిని పురస్కరించుకుని ఊర్లకు వెళ్లే వారు విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లో దాచుకోవాలని, లేదా వెంట తీసుకువెళ్లాలని సూచించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు.. ఇరుగుపొరుగు వారికి చెప్పాలని పేర్కొన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



కార్మికులకు హెల్త్ రిపోర్టులు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చల్లా సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి వంపుగూడలో ఆదివారం భవన నిర్మాణ కార్మికులకు, కార్మిక సంక్షేమ సంఘం సహకారంతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 12 రకాల టెస్టులు చేసి, రిపోర్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్‌కార్డు, బీమా ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వాటిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్, కార్మికులు కృష్ణయ్య, రాములు, జంగయ్య, యాదయ్య, చెన్నమ్మ, రాములమ్మ, మౌనిక, లక్ష్మీ, పూజ, రాధిక, లక్ష్మమ్మ, శారద ఉన్నారు.

బీసీల సంక్షేమమే లక్ష్యం

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి



సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

షాబాద్: బీసీల సంక్షేమమే లక్ష్యంగా తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో సొంతంగా రూ.20లక్షల రూపాయలతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించిన్నట్లు సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లిలో పీసరి సురేందర్‌రెడ్డిని బీసీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సురేందర్‌రెడ్డి బీసీలకు తన సొంత ప్లాటులో తమ తల్లిదండ్రులు పీసరి రాజమ్మ, సత్తిరెడ్డిల జ్ఞాపకార్థరం బీసీ కమ్యూనిటీ భవనాన్ని సుమారు రూ.20లక్షలతో నిర్మించి గ్రామస్తులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తామని గ్రామస్తులకు హామీనిచ్చారు. బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలతో పాటు బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పీసరి అనితారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీసరి వెంకట్‌రెడ్డి, రవీందరెరెడ్డి, మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, గ్రామస్తులు వేణుగోపాల్, లచ్చయ్యగౌడ్, సాయిలు, కిష్టయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కొందుర్గు: గంగన్నగూడలో..



చేవెళ్ల: రావులపల్లిలో..



షాబాద్‌లో..

యువతకు ఆదర్శం వివేకానంద



షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

నేటి యువతతోనే రేపటి దేశ భవిష్యత్ అని స్వామి వివేకానందుడు చెప్పిన సత్యాన్ని యువత గుర్తించి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు సూచించారు. చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ స్వామి వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు నడవాలని సూచించారు.



షాద్‌నగర్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, నాయకులు



చేవెళ్ల: వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



శంకర్‌పల్లి: వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

జేపీదర్గాను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న జేపీదర్గాను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని ఆయన ఆదివారం దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితో కలిసి ఉర్సు ఉత్సవాల నిర్వహణపై వక్ఫ్‌బోర్డు, స్థానిక మైనార్టీ నేతలతో మాట్లాడారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. వక్ఫ్‌బోర్డు ఉర్సు నిర్వాహణకు ఇప్పటికే రూ.15లక్షలు మంజూరు చేసిందని, అదనంగా మరో 5 లక్షలు మంజూరుచేసే విధంగా కృషి చేస్తానని వివరించారు. ఆయా ప్రాంతాల నుంచి ఉత్సవాలకు వచ్చే భక్తుల పట్ల స్థానిక వ్యాపారులు సోదరభావంతో మెలగాలన్నారు. దర్గాకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, ఆగీరు రవికుమార్‌గుప్తా, అంబటి ప్రభాకర్, బాబర్‌ఖాన్, ఖాజా, ఖాలేద్, మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి



గురుకుల కామన్ ఎంట్రెన్స్ పరీక్ష వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల కామన్ ఎంట్రెన్స్ పరీక్ష పోస్టర్‌ను గురుకుల ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థులకు 5 నుంచి 9వ తరగతులలో ప్రవేశాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కామన్ ఎంట్రెన్స్ పరీక్షకు అర్హులందరూ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అన్ని వసతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గురుకుల పాఠశాలలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గురకుల పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిదులు, తదితరులు ఉన్నారు.

కల్యాణం.. వైభోగం

- వైభవంగా చిలుకూరు సురకంటి బ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తజనం



తాళిబొట్టు భక్తులకు చూపిస్తున్న వేదపండితులు

మొయినాబాద్: వేదపండితులు మంత్రోచ్ఛరణలు.. మంగళవాయిద్యాలతో చిలుకూరు సురకంటి బ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. మండల పరిధిలోని చిలుకూరు సురకంటి బ్రమరాంభ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు బ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగెరి మల్లేశ్ దంపతులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు దంపతులు కల్యాణోత్సవంలో కూర్చొని వారి స్వామివారి కల్యాణం జరిపించారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ఆవరణ కిక్కిరిసిపోయింది. చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్, శివాలయం అర్చకుడు సురేశ్ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు..

మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మల్లన్న బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, డోలు తాళాల చప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపు చేపట్టారు. అనంతరం శివసత్తులు అగ్నిగుండాలు తొక్కారు. అగ్నిగుండాలు తొక్కుట, ఉక్కుగొలుసు తెంపే కార్యక్రమాలు ఉత్కంఠ భరితంగా సాగింది. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, వివిధ పార్టీల నాయకులు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, షాబాద్ దర్శన్, కొంపల్లి అనంతరెడ్డి, మహేందర్‌ముదిరాజ్, రామకృష్ణగౌడ్, రాంరెడ్డి, రాజుగౌడ్ తదితరులు మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగెరి మల్లేశ్, కార్యదర్శి గున్నాల గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, మాజీ సర్పంచ్ స్వరూపఆంద్రూ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

ఆమనగల్లు: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి, కర్కస్‌తండాలలో ఆదివారం క్రికెట్ టోర్నీ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. ఆటగాళ్లు ఎంచుకున్న క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. నాయకులు రఘురాములు, డేవిడ్, సుదర్శన్‌రెడ్డి, యాదయ్య, కృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కర్కస్‌తండాలో టోర్నీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి